క్లుప్తంగా

శ్రీవారికి భక్తిశ్రద్ధలతో తిరుప్పావడ సేవ



శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో తిరుప్పావడ సేవను నిర్వహిస్తున్న దృశ్యం

అక్కిరెడ్డిపాలెం : షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో గురువారం తిరుప్పావడ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పులిహోరను రాశులుగా పోసి స్వామికి నివేదించారు. జరిగిన కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తిరుమలేశునికి నిజరూప దర్శనం చేసుకున్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న యూపీహెచ్‌సీ సిబ్బంది

అగనంపూడి: విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకోడానికి ఫుల్ స్క్రీనింగ్ పరీక్షలు ప్రారంభిచారు. లంకెలపాలెం యుపీహెచ్‌సీ ఆధ్వర్యంలో లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంద మందికి గురువారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఎత్తు, బరువు, చెస్ట్, హెచ్‌బీ, బీపీ, వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేపట్టారు. వైద్య పరీక్షల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థికి సంబంధించి ఫుల్‌స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తుండడంతో విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకోడానికి అవకాశం కల్గిందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రగతి కోసం లింగ వివక్ష వీడాలి



న్యాయవాది లక్ష్మీ దీపావళిని సత్కరిస్తున్న విజ్ఞాన్ అధ్యాపకులు

అగనంపూడి: దేశ ప్రగతి, పురోభివృద్ధి కోసం లింగ వివక్ష విడనాడాలని తారతమ్యాలు లేని సమాజంలో మాత్రమే జాతి ముందుకు వెళ్లగలదని బొబ్బిలి బార్‌అసోసియేషన్ సభ్యురాలు లక్ష్మీ దీపావళి, విశాఖ బార్ అసోసియేషన్ సభ్యురాలు ఇరుకు మంజుల అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో ఎంబీఏ విద్యార్థులకు లింగ సమభావన అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో వారు మాట్లాడారు. లింగ బేధాలు లేని సమాజంలో మార్పులు త్వరితగతిన వస్తాయని, ఈతరహా సమాజ నిర్మాణం కోసం లింగ బేధాలు ఉండకూడదన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు, కార్యక్రమ కో ఆర్డినేటర్లు మృధులాదేవి, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన

గాజువాక : క్యాన్సర్ వ్యాధిపై స్థానిక చైతన్య మహిళా కళాశాలలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లయన్స్ క్లబ్‌తో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆంకాలజిస్ట్ డాక్టర్ ప్రభ ప్రసంగించారు. క్యాన్సర్ కారకాలు, నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థినులకు వివరించారు. క్యాన్సర్‌పై ఏమాత్రం ఉన్నా నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని, వెంటనే స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. క్యాన్సర్‌ను సకాలంలో గుర్తిస్తే నివారణకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.చంద్రమహాలక్ష్మి, ఎన్ఎస్ఎస్ పీవోలు సంతోషిని దేవి, వై.వి.ఎన్.లక్ష్మి, టి.పావని, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడిగా పతకాలు — కోచ్‌గా విజయాలు

వాలీబాల్‌లో రాణిస్తున్న స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి రామస్వామి



విజేతగా గెలిచిన షీల్డులతో రామస్వామి

వాలీబాల్ అంటే మక్కువ. చిన్నప్పటి నుంచి సాధన చేశాడు. ఓ వైపు చదువుకుంటూనే మరోవైపు వాలీబాల్ క్రీడలో సత్తా చాటుకుంటూ ముందుకు సాగాడు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించాడు. అనంతరం విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగిగా చేరి వాలీబాల్ క్రీడాకారుడిగా..కోచ్‌గా రాణిస్తున్నాడు కర్నాటకకు చెందిన రామస్వామి.
– ఉక్కునగరం



కోచ్‌గా సీనియర్ బాలుర జట్టుతో రామస్వామి

వాలీబాల్ పట్ల ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు 16వ ఏట బెంగళూరులోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్)లో రామస్వామిని చేర్పించారు.1986లో సాయ్‌లో చేరిన రామస్వామి అదే ఏట జరిగిన జాతీయ స్థాయి అండర్–16 పోటీలో రజత పతకం సాధించాడు. 1989లో అండర్–19 జట్టుకు కెప్టెన్‌గా ఎదిగారు. 1981లో రామస్వామి విశాఖ ఉక్కు కర్మాగారంలో సీనియర్ టెక్నీషియన్‌గా చేరారు. వాలీబాల్‌లో ప్రావీణ్యత ఉన్న రామస్వామిను స్పోర్ట్స్ విభాగంలో పోస్టింగ్ ఇచ్చారు. రామస్వామి ఇంటర్ స్టీల్ వాలీబాల్ పోటీల్లో బంగారు పతకాలు, మూడు రజత పతకాలు గెలుపొందారు. 1991లో జరిగిన ఇంటర్ స్టీల్ వాలీబాల్ పోటీల్లో రజత పతకం, 1995–96, 1996–97 సంవత్సరాల్లో జరిగిన ఇంటర్ స్టీల్ పోటీల్లో బంగారు పతకాలు సాధించారు. అదే విధంగా సం. 2011–12, సం. 2012–13 పోటీల్లో రజత పతకాలు గెలుపొంగా, సం. 2014–15 పోటీలో బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. 1996లో జరిగి జాతీయ స్థాయి బీచ్ వాలీబాల్ పోటీల్లో కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. 1994లో జాతీయ వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలో బంగారు పతకం సాధించారు. స్టీల్‌ప్లాంట్‌లో చేరిన నాటి నుంచి రామస్వామి వరసగా 16 ఏళ్లపాటు వైజాగ్ టీమ్ నుంచి ఇంటర్ డిస్ట్రిక్ట్ ఆడి పాతకాలు సాధిస్తున్నారు. 1995లో జరిగిన జాతీయ వాలీబాల్ పోటీలో సియోల్ ఆసియన్ గేమ్స్‌లో కాంస్య పతకం విజేత క్రితేష్ కుమార్‌తో, 1986లో జూనియర్ ఆసియన్ చాంపియన్‌షిప్ క్రీడాకారులు సంజయ్‌రాయ్ సహ క్రీడాకారుడిగా పోటీల్లో రామస్వామి పాల్గొన్నారు.



జాతీయ వాలీబాల్ చాంపియన్‌షిప్ జట్టుతో..(ఫైల్)

కోచ్‌గా.. 36 ఏళ్ల పాటు క్రీడాకారుడిగా జాతీయ స్థాయి, రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీల్లో అనేక పతకాలు సాధించిన రామస్వామి క్రీడాకారుడి నుంచి కోచ్‌గా మారి స్టీల్‌ప్లాంట్ పరిసర ప్రాంతాలకు చెందిన ఔత్సాహిక క్రీడాకారులకు వాలీబాల్ శిక్షణ ఇస్తున్నారు. ఉక్కు ఇండోర్ స్టేడియంలో ప్రతీ రోజు 50 మంది శిక్షణ ఇస్తూ వారిని జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి పోటీలకు పంపుతున్నారు. ఆయన శిష్యుల్లో ఓ యువకుడు ఖేలో ఇండియా జాతీయ పోటీల్లో కాంస్య పతకం గెలుపొందగా, ఓ బాలిక జాతీయ స్థాయి కేంద్రీయ విద్యాలయం పోటీల్లో బంగారు పతకం సాధించింది. మరో ఇద్దరు బాలికలు ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో బంగారు పతకాలు సాధించారు.

క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం...

క్రీడాకారునిగా 36 ఏళ్ల వివిధ స్థాయిల్లో వాలీబాల్ పోటీల్లో పాల్గొని అనేక పతకాలు సాధించా. ఆ సంతృప్తితో భావితరం క్రీడాకారులను తయారు చేయడానికి కోచ్‌గా మారాను. ఇప్పటికే కొంత మందికి శిక్షణ ఇచ్చా..వారి నుంచి ఫలితాలు వస్తున్నాయి. ఈ ప్రాంతంలో మరింత మంది క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యం.
– హెచ్‌జీ రామస్వామి, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి

తొమ్మిది నెలలుగా జీతాల్లేవు

జెడ్సీవద్ద పారిశుధ్య డైలీ వేజ్ కార్మికుల ఆవేదన



జెడ్సీ శేషాద్రికి వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

గాజువాక : గడిచిన తొమ్మిది నెలలుగా తమకు జీతాలు చెల్లించడంలేదని జీవీఎంసీలో డైలీ వేజ్ ప్రాతిపదికన పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వారు గాజువాక జోనల్ కమిషనర్‌ను గురువారం కలిసి తమ ఆవేదనను వివరించారు. జీతాలను ఇప్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఆప్కాస్‌లో విలీనమైన పారిశుధ్య కార్మికులకు మిస్సయిన జీతాలను చెల్లించాలని ఈ సందర్భంగా యూనియన్ గాజువాక జోన్ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు కోరారు. ఈఎస్ఐ, పీఎఫ్ కోసం క్లాప్ ఆటో డ్రైవర్లు, లోడర్ల జీతాలనుంచి మినహాయిస్తున్న సొమ్మును ఆయా సంస్థలకు చెల్లించడం లేదని వివరించారు. అంతకుముందు తమ సమస్యలపై కార్మికులు జోనల్ కార్యాలయంవద్ద నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు రాము, నక్క నాగరాజు, ఎస్.గణేష్, రాజు, సత్యవతి, మీనాక్షి, బంగారురాజు, గిరి, శివ, అనిల్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొత్త సినిమా షూటింగ్ ప్రారంభం



కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో చిత్ర యూనిట్‌తో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

పెదగంట్యాడ : ఫిల్మ్ నెస్ట్ మూవీస్ బ్యానర్‌లో నిర్మిస్తున్న కొత్త చిత్రం షూటింగ్ మండలంలోని దయాల్‌నగర్ కొండపై ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం లాంఛనంగా ప్రారంభమైంది. వినయ్ ఆదిత్య, దేవీశ్రీ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్‌ను ఆలయ ధర్మకర్త తిప్పల తిప్పల రమణారెడ్డి క్లాప్ కొట్టగా, ఎంతపని చేశావ్ చంటి హీరో శ్రీనివాస్ ఉలిశెట్టి కెమెరా స్విచాన్ చేశారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తొలి సన్నివేశానికి దర్శకత్వం వహించారు. లంక కృష్ణ, సిరసపల్లి నూకరాజు నిర్మాణంలో తస్మాత్ జాగ్రత్త, ఎంత పని చేసావ్ చంటి చిత్రాల దర్శకుడు ఉదయ్ కుమార్ దర్శకత్వంలో బైక్ రేస్ నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు ఉదయ్ కుమార్ మాట్లాడుతూ ఈ సినిమా షూటింగ్‌ను విశాఖ పరిసర ప్రాంతాల్లో పూర్తి చేసి వచ్చే ఏడాది ఫిబ్రవరిలో విడుదల చేస్తామని చెప్పారు. సీనియర్ నటీనటులు కాశీ విశ్వనాథ్, శ్రీలక్ష్మి, జబర్దస్త్ ప్రకాష్‌తో స్థానిక నటీనటులు ఈ చిత్రంలో నటించనున్నారు. ఈ కార్యక్రమంలో పైడిరాజు, సిరసపల్లి వెంకట్, కోడైరెక్టర్ బత్తిన సూర్యనారాయణ, గుంటముక్కల దుర్గాప్రసాద్, డేగల శ్రీహరి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాటరీ కాంట్రాక్ట్ కార్మికుల సేవలు ప్రశంసనీయం



స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్ కాంట్రాక్ట్ కార్మికులతో విభాగాధిపతి, అధికారులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్ బ్యాటరీ–4లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సేవలు ప్రశంసనీయమని కోక్‌ఓవెన్స్ విభాగాధిపతి ఎం.వి.ఎస్.దుర్గాప్రసాద్ అన్నారు. గురువారం విభాగంలో జరిగిన కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికుల సేవలను గుర్తించి వారికి బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ అక్టోబర్ నెల వరకు 62 ఓవెన్లు అందుబాటులో ఉండేవన్నారు. ఉత్పత్తి అవసరాలను దృష్టిలో ఉంచుకుని 67 ఓవెన్లు అందుబాటులో తెచ్చేందుకు కాంట్రాక్ట్ కార్మికులు శాశ్వత కార్మికులతో పాటు చక్కగా పని చేశారన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా విభాగం అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆపరేషన్ ఇంచార్జ్ వై.వి.ఆర్. శ్రీనివాసరావు, అధికారులు కె. తాతారావు, బి. వెంకటేశ్వర్లు, నరసింహారావు, టి. శ్రీనివాసరావు, ఎస్.కె. తివారీ, ఫోర్‌మెన్లు ముసినాడ శ్రీనివాస్, ఐ. గంగాధర్, ఆనంద్‌కుమార్, అప్పలనాయుడు, అప్పారావు, సంతోష్, బి. శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ



బాధిత కుటుంబ సభ్యులకు నిత్యావసరాలను అందజేస్తున్న బట్టు పైడిరెడ్డి

పెదగంట్యాడ: ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఆయా కుటుంబాలను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని 77వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు బట్టు పైడిరెడ్డి కోరారు. జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని పిట్టవానిపాలెంకి చెందిన పిట్ట పోలారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అలాగే మరడ దాసరి పేటకు చెందిన ఈర్ని నారిబాబు అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆయా కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి. దీనిపై సమాచారం అందుకున్న ఆయన ఆయా కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించారు. అనంతరం ఒక్కో కుటుంబానికి మూడు నెలలకు సరిపడా నిత్యావసరాలను అందజేశారు. ఇప్పటికి ఈయన వార్డులో సుమారు 30 కుటుంబాలకు నిత్యావసరాలు అందజేసి సేవాగుణం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసే గుణం, విశ్వసనీయత, ఇవే వైఎస్సార్ సీపీ సిద్ధాంతాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు బట్టు అప్పలరెడ్డి, పిట్ట వెంకటరెడ్డి, ఎ.అచ్చారావు, పి.నాగిరెడ్డి, బి.సతీష్ పి.చందు తదితరులు పాల్గొన్నారు.

దార్శనికుడు.. జ్యోతిరావు పూలే



జ్యోతిరావుపూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ 87వ వార్డు ఇన్‌చార్జ్ శ్రీనివాసరావు

అగనంపూడి: సమసమాజ స్థాపనకు విశేష కృషి చేసిన జ్యోతిరావు పూలే ఆదర్శనీయుడని, దార్శనికుడని వైఎస్సార్‌సీపీ 87వ వార్డు ఇన్‌చార్జ్ కోమటి శ్రీనివాసరావు అన్నారు. మహాత్మా జ్యోతీరావు పూలే వర్ధంతి సందర్భంగా కూర్మన్నపాలెంలోని జ్యోతీరావుపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కులవివక్షత, అంటరానితనం, మహిళల చదువు, సమసమాజ స్థాపనే ధ్యేయంగా ఆయన పాటుపడ్డారన్నారు. కార్యక్రమంలో నాయకులు కేబీఆర్ అంబేడ్కర్, గుంజా చింతయ్య, వడ్లపూడి ఈశ్వరరావు, కోమటి రమాదేవి, వండ్రాసి వెంకటరావు, సుందరమూర్తి, శివప్రసాద్, మురళీ, నగేష్, పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదగంట్యాడ: దిబ్బపాలెం 11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గొడ్డువానిపాలెం, గొందేశి వీధి, కండిపిల్లి వీధి, వెంకన్నపాలెం, కొంగపాలెం, సత్యనారాయణపురం, యాతపాలెం, ఉప్పర కాలనీ, గంగవరం బడేవారి వీధి, జాలరిపల్లిపాలెం, ధారకొండ వీధి, దిబ్బపాలెం తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం తప్పదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గాజువాక : చినగంట్యాడ సెక్షన్‌లోని బి బ్లాక్ ఇండోర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ఎల్వీనగర్, ఆర్ఎంసీ ఫీడర్లకు ఈనెల 29న మెయింటెనెన్స్ పనులు నిర్వహించనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు తెలిపారు. ఈ కారణంగా ఎల్వీనగర్, తోకాడ, డ్రైవర్స్ కాలనీ, కుంచుమాంబ కాలనీ, శ్రీనివాసనగర్, ఆర్ఎంసీ ఇండస్ట్రియల్ ఏరియా, చట్టివానిపాలెం ప్రాంతాలకు శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

మోసం కేసులో వ్యక్తికి జైలు శిక్ష



నిందితుడు రామ్‌చరణ్

అక్కిరెడ్డిపాలెం: ఉద్యోగం ఎర చూపి మహిళ నుంచి బంగారం కాజేసిన వ్యక్తికి కోర్టు జైలు శిక్ష విధించింది. గాజువాక ఎస్ఐ టి.రవికుమార్ గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 2022 డిసెంబర్ 7న మజ్జి బొర్రమ్మ ఆటోలో అనకాపల్లి నుంచి గాజువాక వచ్చింది. ఆటోలో మహిళను అనకాపల్లి జిల్లా లంకెలపాలెం వాంబేకాలనీకి చెందిన బండారు రామ్ చరణ్.. ఉర్ఫ్ కుమార్ పరిచయం చేసుకుని ఎయిర్‌టెల్ కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. దీంతో ఆమె ఇంటర్వ్యూకు హాజరయ్యే ముందు రామ్‌చరణ్‌ను కార్యాలయం వద్ద కలిసింది. ఇంటర్వ్యూ సమయంలో బంగారం వస్తువులు ఉండకూడదని నమ్మించి ఆమె వద్ద ఉన్న మూడున్నర తులాల పుస్తెల తాడు, 4 తులాల హారం, 2 తులాల కాసులపేరు తీసుకుని అక్కడ నుంచి పరారయ్యాడు. దీనిపై మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడ్ని అరెస్ట్ చేసిన గాజువాక పోలీసులు మూడవ అదనపు జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి పల్లవి ఎదుట హాజరుపర్చగా 11 నెలల 21 రోజులు జైలు శిక్షను విధించినట్లు ఎస్ఐ టి.రవికుమార్ తెలిపారు.

రహదారి పునర్నిర్మాణ పనులకు శ్రీకారం



జాతీయ రహదారి పునర్నిర్మాణ పనులు ప్రారంభించిన ఎన్‌హెచ్‌ఏఐ పీడీ ప్రభాత్ రంజన్

సాక్షి ఎఫెక్ట్..

అగనంపూడి: ఎట్టకేలకు భారత జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారుల్లో కదలిక వచ్చింది. సాక్షిలో గురువారం వెలువడిన ‘డోంట్ కేర్’ కథనానికి ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు స్పందించారు. గురువారం ఉదయమే జాతీయ రహదారి పునర్నిర్మాణ పనులు చేపట్టారు. అగనంపూడి టోల్ గేటు నుంచి జూనియర్ కళాశాల వరకు సుమారు రెండు కిలోమీటర్ల దూరం వరకు జాతీయ రహదారి పునర్నిర్మాణానికి పై లేయర్ తవ్వేసి పది రోజుల నుంచి పనులు చేపట్టకుండా మధ్యలో వదిలేయడంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతూ ఉండేవి. అలాగే దుమ్ము ధూళితో వాహనచోదకులు ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని సాక్షిలో కథనం వెలువడడంతో ఎన్‌హెచ్‌ఏఐ పీడీ స్పందించి నిర్మాణ పనులు చేపట్టారు.

పేద మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ



కుట్టుమిషన్ల పంపిణీ ప్రారంభిస్తున్న బిషప్ మహంతి

గాజువాక : స్థానిక సీఎల్‌సీ మినిస్ట్రీస్ చైర్మన్ బిషప్ మహంతి ఆధ్వర్యంలో పేద మహిళలకు కుట్టు మిషన్లను గురువారం పంపిణీ చేశారు. మినిస్ట్రీస్ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహంతి మాట్లాడుతూ పేద మహిళలు తమ కాళ్లపై తాము నిలబడే విధంగా తమ సంస్థ కృషి చేస్తోందని, అందులో భాగంగా కుట్టు మిషన్లను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. తమ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలను కూడా పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని తెలిపారు. పేదలు నివసించే ప్రాంతాల్లో మంచినీటి బోర్లను ఏర్పాటు చేస్తున్నామని, మెడికల్ శిబిరాలను ఏర్పాటు చేసి ఉచిత వైద్యం అందజేస్తున్నామని, ప్రతిరోజు అన్నదానం చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మినిస్ట్రీస్ సభ్యులు ఆల్‌ఫ్రెడ్ మహంతి, మెర్సీ మహంతి పాల్గొన్నారు.

రోడ్లనూ వదలం!



రోడ్డుపైనే డంప్ చేసిన ఐరన్ సామగ్రి



బ్లాక్‌లో రోడ్డుపై నిలిపిన భారీ వాహనాలు



ఓల్డ్ ఎస్ఆర్ఎంటీ లైన్‌లో రోడ్డుపై దుకాణాలు

- ఆటోనగర్‌లో అనధికార వ్యాపారాలు
- ఖాళీ స్థలాల్లో వ్యర్థాల డంపింగ్
- ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్

అక్కిరెడ్డిపాలెం: పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్‌లో వ్యాపారులు రోడ్లను కూడా వదలడం లేదు. ఇదే అదునుగా బయట వ్యక్తులు రోడ్లను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేస్తేన్నారు. దీంతో రోడ్లు ఇరుగ్గా మారుతున్నాయి. కాలుష్యం బెడద పెరుగుతుందని ఉద్యోగులు వాపోతున్నారు. ఫ్యాక్టరీలకు సంబంధించిన పలు రకాల వస్తువులను రోడ్డుపైనే డంప్ చేస్తున్నారు. మరికొంత మంది ప్రైవేటు వ్యక్తులు కూడా మరమ్మతులకు గురైన వాహనాలను రోజుల తరబడి రోడ్లపై వదిలేస్తున్నారు. దీంతో ఆయా బ్లాకుల్లోని ఫ్యాక్టరీలకు భారీ వాహనాలు వచ్చే సమయంలో రాకపోకలకు ఇబ్బందిగా మారుతోందని అంటున్నారు.

స్క్రాప్, ఐరన్ పరిశ్రమల వ్యాపారులు సామగ్రిని నిర్లక్ష్యంగా రోడ్లపైనే డంప్ చేన్నారు. దీంతో రోడ్లు ఇరుగ్గా మాడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

భారీ వాహనాలు రోడ్డుపైనే..

ఆటోనగర్‌లో పలు చోట్ల మరమ్మతులకు గురైన భారీ వాహనాలు, క్రేన్లు రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీనిపై దృష్టి సారించాల్సి ఐలా అధికారులు, సిబ్బంది పట్టించుకోక పోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయని వాపోతున్నారు.

చిరువ్యాపారుల హవా....

ఆటోనగర్‌లో పలు చోట్ల చిరువ్యాపారులు రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తూ ఇబ్బందికరంగా మారుతున్నారని పలువురు వాహన చోదకులు ఆరోపిస్తున్నారు. ఆటోనగర్‌లో పాత ఎస్ఆర్ఎంటీ, ఆటోనగర్ పార్క్ పక్కనున్న ఎస్ఎఫ్ఎస్ క్వార్టర్స్ వద్ద అనధికార దుకాణాలు వెలిశాయని చెబుతున్నారు. ఐలా అధికారులు అనధికారికంగా ఏర్పాటు చేసుకున్న స్టాళ్లపై చర్యలు చేపట్టి రోడ్డుపై అవాంతరాలు లేకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.